# ఆర్‌డిటి

## ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం అక్టోబరు 2006

FOR PRIVATE CIRCULATION ONLY


## మీకు తెలుసా !

- పుదీనా ఆకులు నమిలితే, నోటిలోని బ్యాక్టీరియా నశిస్తుంది.
- రక్తహీనత నివారణకు ఐరన్ టానిక్కులు బదులు గోంగూరను ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుంది.
- మెంతికూర కాలేయం చురుకుగా పనిచేయడానికి దోహదపడుతుంది. ఐరన్ శాతం ఎక్కువగా ఉండడంవల్ల కళ్ళకు కూడా మంచిది.
- బచ్చలికూర తినడంవల్ల జీర్ణకోశ వ్యాధులు, రక్తహీనత, ఊపిరితిత్తుల వ్యాధులురావు.
- ముల్లంగి ఆకుల రసాన్ని నిత్యం ఉదయం, సాయంత్రం సేవిస్తే కడుపులో క్రిములు నశిస్తాయి.
- మునగాకులో విటమిన్-ఎ అధికంగా ఉండడంవల్ల కళ్ళకు చాలా మంచిది.
- అవిశె ఆకులకూర ఉబ్బసం రోగులకు చాలా మంచిది.
- ప్రసవ సమయంలో నొప్పులతో బాధపడే స్త్రీలకు సుఖప్రసవం కోసం కొత్తిమీర ఆకులను నలిపి వాసన చూపిస్తారు.
- కరివేపాకులో కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచేగుణం ఉంది.

(అన్నదాత సెప్టెంబరు - 2006 నుండి)

### చిట్కా :

దానిమ్మ చెట్టు పళ్ళ తొనలను నీళ్ళలో వేసి మరిగించి, కషాయంకాచి, నువ్వులనూనెతో కలిపి మూడు రోజులపాటు తాగితే కడుపులో నులిపురుగులు పోతాయి.

## అమెరికా రాష్ట్రాలలో వ్యవసాయ క్షేత్రాల సందర్శన - అనుభవాలు - 4

*గత సంచిక తరువాత...*

అమెరికాల రాష్ట్రాలలో వ్యవసాయం, ఇతర ఆధార పరిశ్రమలు ఏ రకంగా రైతులకు ప్రయోజనాన్ని చేకూరుస్తున్నాయో తెలుసుకున్నాము. ప్రస్తుతం మరిన్ని విషయాలు తెలుసుకుందాం.

### ఫారం సర్వీస్ ఏజన్సీ (FSA)

అమెరికా వ్యవసాయాన్ని భవిష్యత్తులో ఆర్థికంగా, పర్యావరణపరంగా ఒక మంచి స్థాయికి తీసుకెళ్ళేందుకు అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగవర్గంతో వినియోగదారులే నడుపుకుంటున్న సంస్థ ఇది.

### ఫారం సర్వీసు ఏజన్సీ ప్రకటిత లక్ష్యాలు

వ్యవసాయంలో ఆదాయాన్ని సుస్థిరపర్చడం, రైతులకు అండగా ఉండడం, భూమి, నీటి వనరులను సంరక్షించడం, ఏ అవకాశాలు లేని రైతులు, పశువుల పెంపకందారులకు రుణ సౌకర్యం కలిగించడం, ప్రకృతి వైపరీత్యాల నష్టాల నుండి, వ్యవసాయ కార్యక్రమాలు తిరిగి ప్రారంభించడానికి సహాయపడడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తుంది.

ఫారం సర్వీసు ఏజన్సీ అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి 1994లో దీనిని ఏర్పర్చింది. వ్యవసాయం స్థిరీకరణ, సేవల సంరక్షణతోపాటు వివిధ ఏజన్సీల ద్వారా కార్యక్రమాల్ని రూపొందించారు. అటువంటి వాటిలో ఫెడరల్ క్రాప్ ఇన్సూరెన్సు, (ప్రస్తుతం సమస్య నివారణా సంస్థ) రైతుల స్వయంపాలన లాంటి సంస్థలు కూడా ఉన్నాయి. కాలక్రమంలో దీనిపేరులో మార్పులు వచ్చినా, 1930 దశకం నుండి ఇది రైతులతో సంబంధబాంధవ్యాలు కొనసాగిస్తూనే ఉంది.

ఆ రోజుల్లో అమెరికన్ కాంగ్రేస్ ఒక ప్రత్యేకమైన విధానం రూపొందించింది. దీని ద్వారా ఫెడరల్ ఫారం (వ్యవసాయ సమాఖ్య) కార్యక్రమాలు స్థానికంగానే రూపొందించబడుతుండేవి. ఇందులో పాల్గొనడానికి అర్హులైన రైతులు మూడు నుంచి 5 మంది వరకూ సభ్యులతో ఒక ప్రాదేశిక కమిటీని ఎన్నుకొనేవారు. ఆ కమిటి వ్యవసాయ పథకాల ఆచరణలను సమీక్షించి, వీటిని ఏ విధంగా కొనసాగించాలో నిర్ణయాలు తీసుకునేవారు. దీని ద్వారా ఫెడరల్ ప్రభుత్వ విధానాలు తమ జాతులకు తమ వ్యక్తిగత వ్యవసాయ కార్యక్రమాలకు ఏ విధంగా అనానుకూలంగా ఉన్నాయో చర్చించుకునేందుకు చాలా అవసరమైన వేదికగా మారింది. దాదాపు 60 సంవత్సరాల తరువాత కూడా ఫారం సర్వీసు ఏజన్సీ చేసిన కృషి, అమెరికా వ్యవసాయ సంరక్షణ. అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

### ఫారం సర్వీసు ఏజన్సీ చరిత్ర

1933లో ప్రపంచవ్యాప్తంగా అలుముకున్న గొప్ప ఆర్థికమాంద్యపు రోజులలో ఇది జీవం పోసుకుంది. పెరుగుతున్న నిరుద్యోగం, వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభాల కారణంగా ప్రజలలో అసంతృప్తి బాగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ అమెరికా ప్రజలకు కొత్త విధానాన్ని అందిస్తానని ప్రకటించాడు.

దీనిఫలితంగానే 1935లో వ్యవసాయశాఖ అనుబంధసంస్థగా ఫారం సర్వీసు ఏజన్సీని నెలకొల్పారు. ఇది వ్యవసాయ సంరక్షణ నిర్ణాయక సంస్థగా పేరుపొందింది. మునుపు పునరావాస పాలనా సంస్థ పేరుతో పిలిచేవారు. తరువాత 1937 మార్పు చేశారు. దీని ప్రధాన ఆశయం వ్యవసాయాన్ని లాభవంతంగా కొనసాగించేందుకు, అందుకు అనువైన ప్రదేశాలలో రైతులకు పునరావాసం ఏర్పాటు చేయడం. అయితే పునరావాసం అన్నది ఖర్చుతోనూ, సమస్యాత్మకంగా →

మారడంతోపాటు ఫలితాలు అస్పష్టంగా వచ్చాయి. ఇది నిర్వహించిన మిగతా కార్యక్రమాల పాత్ర చాలాముఖ్యమైనది. స్టాండర్డు రూల్ రిహాబిలేటేషన్ రుణ ప్రోగ్రాం చెప్పుకోదగ్గది. దీని ద్వారా రైతులకు రుణ సదుపాయం, వ్యవసాయ నిర్వహణలో తగు ప్రణాళికలు రూపొందించడం, సాంకేతిక పర్యవేక్షణ సేవలు లభించేవి. దేశీయ వ్యవసాయ యాజమాన్యంలో ఈ కార్యక్రమం అగ్రభాగాన ఉండేది.

మరొక సంబంధిత కార్యక్రమం వ్యవసాయం రుణాల సర్దుబాటు, పంట కాలాన్ని పెంచడం, కొన్ని సందర్భాలలో ఫారం సర్వీసు ఏజన్సీ సూపర్‌వైజర్లు స్థానిక రైతుకమిటీల సభ్యుల స్వచ్ఛంద సహాయంతో రుణగ్రహీత రైతుల రుణదాతల మధ్య సమస్యల నివారణకు మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్యల్ని సానుకూలంగా పరిష్కరించేవారు. రైతు వ్యవసాయంలో కొనసాగేకాలం పెరిగిన కొద్దీ, అప్పులిచ్చే బ్యాంకరుకు లాభాలు పెరుగుతాయని ఈ కమిటీ నచ్చచెప్పేది. ఈ సంస్థ సహకార సంస్థల్ని కూడా నెలకొల్పింది. గ్రామీణ నిరుపేద కుటుంబాలకు వైద్య సహాయం కూడా అందించింది. దీని కార్యక్రమాలు పరిమితమైనవే అయినప్పటికీ, ఈ పథకంలో పాల్గొన్న నిరుపేద కుటుంబాలు ఎక్కువ లాభపడినాయి. ఫారం సర్వీసు ఏజన్సీ కార్యక్రమాల్లో పాల్గొన్న కుటుంబాలు 1937-1941 మధ్య కాలంలో వాటి ఆదాయం 69 శాతం అభివృద్ధి చేసుకొన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. ఇదే కాలంలో ఆహార పదార్థాల తలసరి వినియోగం 85 పౌండ్ల నుండి 447 పౌండ్లకు పెరిగింది. సగానికిసగంపైగా పాల వినియోగం కూడా పెరిగింది.

1946లో ఫార్మర్స్ హోమ్ అడ్మినిస్ట్రేషన్ ఆర్ట్స్, ఫారం సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్‌ను ఎమర్జన్సీ క్రాప్ ఫీడ్‌లోన్ డివిజను, ఫారం క్రెడిట్ అడ్మినిస్ట్రేషన్‌తో బలోపేతం చేసింది. ప్రభుత్వ రంగ సంస్థగా ఇది ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. ఈ చట్టం వినియోగదారులు తీసుకునే రుణాలకు భీమా వర్తింపచేయడానికి అవకాశం కల్పిస్తుంది. తరువాత కాలంలో గ్రామీణ గృహనిర్మాణాలకు, గ్రామీణ వ్యాపారదారులకు, గ్రామీణ నీటి సరఫరా, మురుగు నీటిపారుదల నియంత్రణ ఏజన్సీలకు ఈ భీమా అవకాశాన్ని విస్తరించారు.

తరువాత వ్యవసాయ సర్దుబాటు చట్టం 1933 ద్వారా వ్యవసాయ సర్దుబాటు పాలనా సంస్థను ఏర్పాటు చేశారు. దీని ముఖ్య కార్యనిర్వహణ, రైతులు దెబ్బతినకుండా వ్యవసాయోత్పత్తుల ధరల్ని నియంత్రణలో ఉంచటం. ఈ సంస్థ రెండు ప్రధాన కార్యక్రమాల కోసం నిర్మితమైంది. ఒకటి ఉత్పత్తిరంగం, రెండవది ప్రాసెసింగ్, మార్కెటింగ్, వినిమయ ఉత్పాదనలైన పాడిపరిశ్రమ, వరి, పొగాకు, చక్కెర, గోధుమ, పత్తి, మొక్కజొన్న, పందులపెంపకం లాంటివాటి లక్ష్యాలుగా పనిచేస్తుంది.

1938లో వ్యవసాయ సర్దుబాటు చట్టం పాసైనవెంటనే, వ్యవసాయ శాఖలో చాలా మార్పులు వచ్చాయి. వ్యవసాయ సంరక్షణ, పంటలకిచ్చే సపోర్టు మార్కెటింగ్ చట్టాలలో మార్పు వచ్చింది. వినిమయ ఉత్పాదనల ధరల నియంత్రణ, రైతుల ఉత్పాదనలకు రైతులందరికీ ఒకే విధమైన ధరలు పొందే సదుపాయం, సమాన ఆదాయం పొందే వీలు లాంటి మార్పులతో జాతీయ రైతులకు ఫెడరల్ ప్రభుత్వం రక్షణ చేకూర్చింది.

రెండవ ప్రపంచ యుద్ధంలో పెరల్‌హార్బర్ దాడికి గురైన వెంటనే, "యుద్ధ సమయంలో ఆహార పదార్థాల వ్యవహార సంస్థ"ను ఏర్పాటు చేశారు. యుద్ధ సమయంలో దేశంలో ఆహారపదార్థాల కొరత రాకుండా చూడడం దీని పని. దీని ఆధ్వర్యంలో ఆహారపదార్థాల ఉత్పత్తి. మార్కెటింగ్, సరఫరాలను ఉపవిభాగాలుగా విభజిస్తూ ఒకే కేంద్రీకృత సంస్థ ద్వారా ముఖ్యమైన వినియోగ పదార్థాల సరఫరాలో అడ్డంకులు ఏర్పడకుండా చూడడం దీని ముఖ్య ఉద్దేశ్యం.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, ఈ సంస్థను రద్దు చేశారు. దీని స్థానంలో ఉత్పత్తి, మార్కెటింగ్ నిర్వహణ సంస్థను ఇతర బాధ్యతలతో ఏర్పాటు చేశారు. కార్యక్రమాల పర్యవేక్షణకు ఫీల్డ్ సర్వీసు విభాగాన్ని ఏర్పాటు చేశారు.

యుద్ధానంతర కాలంలో మునుపున్న ప్రశాంత కాలంలోని ఉత్పత్తిస్థాయికి ఉత్పత్తులను అభివృద్ధి చేయడం చాలా కష్టసాధ్యమైన పనిగా ఉండింది. కొత్త ప్రాధాన్యతలను ఏర్పాటు చేయవలసివచ్చింది. అదే సమయంలో కొన్ని వినిమయ ఉత్పాదనలు అధికంగా పండడంవల్ల, ధరలు తగ్గి రైతుల ఆదాయానికి గండిపడే ప్రమాదం సంభవించింది. యుద్ధాల కారణంగా ఇతర దేశాలు దిగుమతులు చేసుకున్నా, అధికోత్పాదన ఒక తీవ్రమైన సమస్యగా ఉంటూ వచ్చింది.

1953లో ప్రభుత్వశాఖలలో మార్పులు ప్రవేశపెట్టారు. వ్యవసాయ ఉత్పత్తుల మద్దతుధరల నిర్ణాయక అధికారాలు, విధులలో మార్పులు తెచ్చారు. ఈ మార్పులకు వినిమయ ఉత్పాదనల నియంత్రణ సర్వీసు అనే ఒక కొత్త పేరుపెట్టారు. వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి పెద్దపీటలేశారు. దీనితోపాటు అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని పెంచడానికి మట్టి నిధి పథకాన్ని రూపొందించారు. దీని ద్వారా 10 సంవత్సరాలకు పైగా నిరుపయోగంగా ఉన్న భూములను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడంలో మొట్టమొదటిసారిగా గ్రామీణ, ప్రాంతీయ, రాష్ట్రీయ కమిటీలను నెలకొల్పారు. వ్యవసాయాన్ని స్థిరీకరించడం, వాటిని పరిరక్షించడంలో ఈ కమిటీలు పాత్రవహిస్తాయి.

వ్యవసాయ సర్దుబాటు వ్యవహార సంస్థ 1961లో కొత్తపేరుతో వ్యవసాయ స్థిరీకరణ, వనరుల సంరక్షణ మిషన్‌గా రూపాంతరం చెందింది. రాష్ట్ర, ప్రాంతీయ అధికార యంత్రాంగంతో వ్యవసాయ పథకాల అమలు కొనసాగిస్తున్నారు.

1994లో అమెరికా సంయుక్త రాష్ట్రాల వ్యవసాయశాఖ పునర్వ్యవస్థీకరణ ఫలితంగా కన్సాలిడేటెడ్ ఫారం సర్వీసు ఏజన్సీ ఏర్పడింది. తరువాత 1995 నవంబరులో దీనికి ఫారం సర్వీసు ఏజన్సీగా పేరు మార్చారు. ఈ కొత్త సంస్థ వ్యవసాయ స్థిరీకరణ, పరిరక్షణ, ఫెడరల్ క్రాప్ ఇన్సూరెన్స్, ఫారం క్రెడిట్ పోర్షన్ లాంటి పథకాలమీద తగు ప్రాధాన్యలతో పనిచేస్తూ ఉంది. 1996 మే మాసంలో ఫెడరల్ క్రాప్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఏజన్సీగా పేరుమార్చారు. ఫారం సర్వీసు ఏజన్సీ మాత్రం వ్యవసాయ వినిమయ ఉత్పత్తులు. రైతు సంరక్షణ పథకాల అమలు, అత్యవసర రుణ సదుపాయం, యజమాన్య హక్కులు తదితర వాటిమీద పని చేస్తూనే ఉంది.

### ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సర్వీస్ (FNS)

అమెరికా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మునుపటి ఫుడ్ అండ్ కన్స్యూమర్ సర్వీస్ సంస్థ స్థానంలో ఈ సంస్థను ఏర్పర్చారు. దీని ప్రధాన కర్తవ్యం, ఆహార సహాయ పథకం ద్వారా పసిపిల్లలకు, అవసరమైన కుటుంబాలకు మంచి బలవర్థక ఆహారం లభించేలా చూడడం దీని పని.

ఈ సంస్థ బలవర్థక ఆహార పథకం అమలు, బలవర్థక ఆహార విజ్ఞానం కార్యక్రమం ప్రముఖ స్థానాన్ని కల్పించారు. కేవలం బలవర్థక ఆహార సమస్యమీదనే కాకుండా, బలవర్థక ఆహారానికి, బలవర్థక ఆహార విజ్ఞానానికి అంత స్వాత్రాన్ని దాని ప్రాముఖ్యతను ఈ కార్యక్రమంలో పాల్గొనే వారిలో అవగాహన కల్పించడం కూడా ఒక ముఖ్య కార్యక్రమంగా పెట్టుకొని ఉంది.

*(మిగతా వచ్చే మాసం)*

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి**

## నీతి వాక్యం :

అ॥ అవగుణ మేల లోభ మెనయన్ ? గొలలేటికి గొండెమున్న ? కె
త్యవచన మున్న నేలతప ? మాత్మశూచింగన దీర్థమేల ? మే
లవు సుజనత్వమేల సుగుణాళి మహత్త్వమై చాలు సొమ్ములే
ల ? విభవ మేల విద్యప్రబలన్ ? సడిc జెందిన మృత్యువేటికిన్.

– భర్తృహరి

## తాత్పర్యము:

పీనాసి తనముంటే, మరో దుర్గుణంతో పనిఏటికి ? చాడీలు చెప్పే బుద్ధి ఉంటే నరకంలో పడడానికి వేరే పాపాలు చేయడందేనికి ? సత్యసంధత ఉంటే పాపాలను పోగొట్టుకోవటానికి వేరే తపమాచరించాల్సిన అవసరం ఏముంది ? చెడు ఆలోచనలు లేకుండా నిర్మలమగు మనస్సు ఉంటే, మోక్షసాధనకు తీర్థసేవ చేయాల్సిన అవసరమేముంది ? అపకీర్తి ఉంటే అది మృత్యువుతో సమానంగనుక వేరే చావుతో పనేముంది ?

## చర్చ :

మనిషిలో ఉండకూడని దుర్గుణాల గురించి భర్తృహరి మనకు తేటతెల్లంగా తెలియజేస్తున్నాడు. అసలు సన్మార్గము, దుర్మార్గం అంటే ఏమిటి అని ప్రశ్నించుకున్నప్పుడు సూక్ష్మంగా జవాబు చెప్పుకోవచ్చు. సన్మార్గం అంటే ప్రకృతి అనుమతించిన జీవన విధానం. దుర్మార్గం అంటే ప్రకృతి నియమాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం. ప్రకృతి నియమాలనుసారం అంటే ఎలా ఉండాలి ? ప్రకృతి అనుమతించిన లక్షణాలు అంటే స్వాభావిక లక్షణాలు – పరులకోసం మేలుచేసేదిగా ఉండాలి. ఇతరులను గురించి చెడుగా మాట్లాడకపోవడం, చెడు తలంపులు లేకపోవడం, తోటి జీవరాసులు ప్రకృతి సంపదపట్ల ప్రేమగా ఉండడం, ప్రకృతి సంపదను నాశనం చేయకపోవడం. ఇలాంటివన్నీ ప్రకృతి అనుగుణంగా జీవించే జీవన విధానాలు.

దుర్మార్గంగా బతకడమంటే, క్రూరమైన పనులు చేయడమే దుర్మార్గజీవన విధానం కాదు. స్వలాభాపేక్షకు ప్రకృతి వనరులైన కొండలు, గుట్టలు, అడవులు ధ్వంసం చేయడం, లోతైన బోర్లతో భూగర్భ జలసంపదను తోడివేయడం, చెరువులు, కుంటల్ని ధ్వంసం చేయడం – ఇవన్నీ కూడా దుర్మార్గపు పనులు కిందే వస్తాయి.

ఇటీవల డి.హీరేహాళ్ మండలంలో ఖనిజ సంపద కోసం కొండలకు కొండలే కరిగించి వేస్తూ, ఆఖరికి సుంకులమ్మ దేవత గుడిని కూడా పేల్చేశారు. స్వలాభం ముందు గుళ్ళు, దేవతల్ని కూడా లెక్కచేయరని ఈ ఉదంతం మనకు తెలియజేస్తున్నది. అసలు ప్రకృతి సంపదలైన కొండలు నాశనమైపోతున్నాయని ఎవరికీ పట్టలేదు. కానీ గుడి తిరిగి నిర్మించాలని కొందరు, గుడుల కోసం ఎంతో చేశామని కొందరు సమస్యను రాజకీయం చేస్తున్నారు. ఇటువంటి తగాదాలు చివరికి ఏ పద్ధతిలో ముగుస్తాయో అందరికీ తెలుసు. డబ్బుతో దేవుడి నోరే మూయించగల ఘనాపాటీలు ఉన్న మన సమాజంలో దేవుళ్ళ నోళ్ళయినా మూయించగలరు. అంతిమ పరాజితులు మాత్రం ప్రజలమైన మనం, మన ప్రకృతి.

వై.వి. మల్లారెడ్డి

# ప్రదర్శనా క్షేత్రములు

## ప్రదర్శనా క్షేత్రముల ఉద్దేశ్యము :

- రైతులు లాభదాయకమైన వ్యవసాయ పద్ధతులు పొలం ఆరోగ్యం గురించి తెలుసుకొనేట్లు చేయుట.
- ఆరోగ్యకరం, లాభదాయకం, ఆచరణయోగ్యమైన పద్ధతులు పాటించునట్లు చేయుట.
- సహజంగా లభ్యమగు వివిధ వనరులు ఉపయోగించుకొను విధానాలు తెలియజేయుట.
- బయటి పెట్టుబడులు తగ్గించు విధానాలు పాటించే విధానాలు తెలియజేయుట.
- పై విధానాలు ఆచరించునట్లు చేయుట.
- రైతులే ఫలితాలను విశ్లేషించునట్లు చేయుట.
- ఫలితాలు విశ్లేషించునప్పుడు సిబ్బంది సహకరించవలెను.

## ప్రదర్శనా క్షేత్రముల నిర్వహణ :

- లాభదాయకమైన ఏ అంశాలు రైతుల చేత చేయించదలచినామో దానిపై రైతులకు అవగాహన కల్పించుట.
- ఈ విధానం, పద్ధతివల్ల తనకు ఉపయోగం, లాభమని రైతు గ్రహించునట్లు చేయుట.
- కొన్ని అంశములు పర్యవేక్షకులు (సిబ్బంది) చేసి చూపించుట.
- రైతులు ఆచరించునప్పుడు సిబ్బంది ఉండి సలహాలు సూచనలు ఇవ్వవలెను.
- ప్రదర్శనా క్షేత్రము యొక్క ప్రాముఖ్యత ప్రక్క రైతులకు తెలియజేయుట.
- ప్రదర్శనా క్షేత్రము అన్ని దశలలో ఎక్కువమంది రైతులు చూచుటకు అవకాశం ఉండునట్లు చేయవలెను.
- ప్రదర్శనా క్షేత్రములు రోడ్లు, బండ్లబాటలు, కాలిబాటల ప్రక్కన, ఎక్కువమంది చూచుటకు అనుకూలమగు స్థలములలో ఏర్పాటు చేయవలెను.
- ప్రదర్శనా క్షేత్రములులో అన్ని వివరాలు తెలుపు బోర్డులు పెట్టవలెను.
- లబ్ధిదారులు మరియు ప్రక్క రైతులతో కలిసి ప్రదర్శనా క్షేత్రములు సందర్శించుట.
- పాటించిన అంశాలు ప్రభావములను తరచుగా గమనించుట.

## విశ్లేషణ :

- సాంప్రదాయంగా చేయు విధానంకన్నా పాటించిన విధానం మెరుగైనదా లేదా ?
- ప్రాంతానికి, వాతావరణానికి అనువైనదా లేదా ?
- ఆచరించడం కష్టమా ? సులభమా ?
- సహజవనరులపై ప్రభావం
- మనుషులు, పశుపక్ష్యాదులుపై ప్రభావం
- సాంప్రదాయ పద్ధతికన్నా ఖర్చు తక్కువా ? ఎక్కువా ?
- దిగుబడులపై ప్రభావం
- పశువుల మేత, మేత నాణ్యత
- సహజ మిత్ర పురుగులపై ప్రభావం
- లబ్ధిదారులు, ఇతర రైతులు రాబోవు కాలంలో ఆచరించుటకు సుముఖత, విముఖత
- కిసాన్ మేళా జరిపి సాధించిన మంచి ఫలితాలను రైతులు ఇతర గ్రామాల రైతులకు తెలియజేయుట.

# ఈ మాసంలో వ్యవసాయం

## సేంద్రీయ ఎరువు (కంపోస్టింగ్)

### కంపోస్టింగ్ అంటే ఏమిటి ?

ఇది ఒక జీవ ప్రక్రియ. చాలా సూక్ష్మజీవాలు సరైన పదును (తేమ) వేడి మరియు గాలి ఉన్నప్పుడు సేంద్రీయ పదార్థాన్ని మురిగేటట్లు చేసేదాన్ని కంపోస్టింగ్ అంటారు. ఈ విధంగా బాగా మురిగి, తయారైన ఎరువునే కంపోస్టు లేక సేంద్రీయ ఎరువు అంటారు.

### కంపోస్టింగ్‌లో రకరకాల పద్ధతులు – వాటిలో ముఖ్యమైనవి.

**1. కుప్ప పద్ధతి.** **2. గుంత పద్ధతి.**

**3. నాడెప్ పద్ధతి.** **4. వానపాముల పద్ధతి.**

### 1. కుప్ప పద్ధతి

భూమిపై ఎటూ 2 గజాలు ఉండే జాగాలో కుప్పగా బెడ్ వేసుకోవాలి. వరుసలు వేసే ముందు కుప్ప మధ్య భాగంలో 4 అంగుళాల దొడ్డుకర్ర పాతాలి. ఈ కట్టె వెంబడి కుప్పలోని వేడి బైటికి పోతుంది. అప్పుడప్పుడు కట్టెను కుప్పలోని వేడిగాలి బైటికి పోతుంది. భూమిపై నుండి కుప్ప ఎత్తు గజమున్నర వుండాలి.

- ✪ గ్లిరిసీడియా, కానుగ, సుబాబుల్ వంటి కొమ్మలను మొదటివరుసలో 6–8 అంగుళాల మందంతో వేయాలి.
- ✪ దీనిపై 8 అంగుళాల మందం ఎండుగడ్డి మొదలగునవి వేయాలి.
- ✪ తర్వాత దానిపై 5 అంగుళాల మందంతో ఎండిన పంట పొర్కస్తైలో గడ్డి, సుబాబుల్, కానుగ, గ్లిరిసీడియా వంటివి ఒక వరుస వేయాలి.
- ✪ పైన చెప్పిన వరుసలను అదే క్రమంలో కుప్ప ఎత్తు ఒకటిన్నర గజం అయ్యేవరకు వేయాలి.
- ✪ అంగుళం మందంతో మట్టిని లేదా బురదను వాడి కుప్పను మూయాలి.
- ✪ కుప్పపై అప్పుడప్పుడు నీళ్ళు చల్లి తడివుండునట్లు చేయాలి.
- ✪ కుప్పను 10–15 రోజులకొకసారి కలియత్రిప్పాలి.

పై విధంగా చేస్తే 6 నుండి 8 వారాలలో కంపోస్టు తయారవుతుంది.

### 2. గుంత పద్ధతి :

మనకు లభ్యమయ్యే చెత్త, ఇతర వ్యర్థములను బట్టి ఏ కొలతల గుంత కావాలో అంత గుంతను త్రవ్వుకోవాలి. ఈ పద్ధతి ఎక్కువగా నీళ్ళు లేని స్థలాలలో ఎండాకాలంలో చేసుకుంటే మంచిది.

#### చేసే విధానం

- ✪ రెండు గజాల పొడవు, రెండు గజాల వెడల్పు, ఒక గజంలోతు గుంత (2×2×1 గజం) కొంతవరకు సమంజసం.
- ✪ గుంత చెట్టు నీడలో వుంటే మంచిది.
- ✪ గుంతలోని వేడి బయటకు వెళ్ళడానికి 2–3 కట్టెలు 3 నుండి 4 అంగుళాల మందం గలవి బెడ్ వేయక ముందే అక్కడక్కడా పాతాలి. ఇవి గుంతలోని వేడిని బయటికి పంపుటకు ఉపయోగపడుతాయి.
- ✪ గంతలో మొదట 8 అంగుళాల మందం పీచు పదార్థాలు (కొబ్బరి పీచు, ఎండుగడ్డి మొదలగునవి) వేయాలి.
- ✪ తర్వాత 8 అంగుళాలు కట్టెపొట్టు, ఎండుగడ్డి వేయాలి.
- ✪ దానిపై 4–6 అంగుళాల మందంలో పచ్చి ఆకులు వేయాలి. ఉదా : గ్లిరిసీడియా, కానుగ, సుబాబుల్, వేరే ఆకులలములు వేయాలి.
- ✪ పైన వేసిన వరుసలను ఒక అంగుళం మందం మట్టి లేదా పేడతోటి మూయాలి.
- ✪ పైన చెప్పిన విధంగా గుంత నిండేవరకూ అదే పద్ధతిలో వివిధ పదార్థాలతో వరుసలు వేయాలి.
- ✪ గుంత నీడలో లేకుంటే కొబ్బరి, తాటాకులతో లేదా వేరే పదార్థములతో కప్పవలెను. దీనివల్ల ఎండ, వాన నుండి కాపాడవచ్చును.
- ✪ గుంతలోని పదార్థములను 15–20 రోజులకొకసారి బాగా కలపాలి.
- ✪ గుంతలో తేమ ఉండేటట్లు అప్పుడప్పుడు నీళ్ళు చల్లాలి.

ఈ విధంగా చేస్తే 12–16 వారాలలో కంపోస్టు ఎరువు తయారవుతుంది.

### 3. నాడెప్ పద్ధతి :

ఈ పద్ధతిలో ఇటుకలతో ట్యాంక్ కట్టాలి. ట్యాంకు కట్టు పద్ధతి.

- ✪ నీరు నిలవని కొంచెం ఎత్తైన స్థలంలో ట్యాంకు కట్టాలి.
- ✪ ట్యాంకు పొడవు 2 గజాలు, వెడల్పు ఒకటిన్నర గజం మరియు ఎత్తు 1 గజము.
- ✪ ప్రతి ఇటుకను మధ్యలో 2 అంగుళాల సందు ఉండేటట్లుగా చేయాలి.

#### బెడ్ వేయవలసిన విధానం :

- ✪ మొదట 6 అంగుళాల మందం వరుసలలో ఎండుగడ్డి, పచ్చిగడ్డి, గ్లిరిసీడియా, కానుగ, సుబాబుల్ ఆకులు, అలుములు, పంటనూర్పిడి తరువాత వచ్చిన వ్యర్థ పదార్థములు మొదలైన వాటిని వేయాలి.
- ✪ ఇలా వేసిన వరుసలపై 5 కిలోల పచ్చిపేడ 7–8 కడవల నీటితో కలిపి చల్లాలి.
- ✪ దాని తర్వాత 15–20 ఇనుప తట్టల మట్టి పలుచగా చల్లాలి. ఈ మట్టి పోషకాలను పట్టుకొని ఉంటుంది.
- ✪ మళ్ళీ చెత్త, దానిపై పేడ నీళ్ళు, దానిపై మన్ను చల్లాలి.
- ✪ ఈ విధంగా ట్యాంకు నిండేవరకు వరుసలు వేయాలి.
- ✪ ఆఖరి అంచు 1 అంగుళం మందం మట్టితో కప్పాలి.
- ✪ వారానికి రెండుసార్లు 3–4 కడవల నీళ్ళు ట్యాంక్‌లో వేయాలి.
- ✪ 3–4 నెలల్లో మంచి ఎరువు తయారవుతుంది.

### కంపోస్టు ఎరువు చేయడానికి పనికి వచ్చే సేంద్రీయ పదార్థములు :

- ✪ గ్లిరిసీడియా ఆకులు, సుబాబుల్ ఆకులు, కానుగ ఆకులు, సీమ తంగేడు ఆకులు, పచ్చిగడ్డి, ఎండుగడ్డి, వరి గడ్డి, కలుపు మొక్కలు, కూరగాయల చెత్త, పంట నూర్పిడి చేసిన తర్వాత వచ్చు వ్యర్థములు, స్టైలోహామాట గడ్డి, పండ్ల చెత్త, పేడ, మట్టి, ఏవైనా మురిగే పదార్థములు.

### కంపోస్టింగ్ చేయడానికి వాడకూడని పదార్థాలు :

- ✪ గాజు, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ డబ్బాలు, రబ్బరుతో చేసిన ఏ వస్తువైనా మరియు ఇనుప వస్తువులు వాడరాదు.

ప్రచురణ: డైరెక్టరు – ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం – 515 002.

☎ (08554) – 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) – 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in